క్లుప్తంగా

ఎత్తిపోతల పథకాల అభివృద్ధికి చర్యలు

బిక్కవోలు: ఎత్తిపోతల పథకాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోందని ఎత్తిపోతల కార్యనిర్వాహక అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి అన్నారు. ఇలపల్లిలోని విఘ్నేశ్వర స్వామి ఎత్తిపోతల పథకం వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రంగాపురంలో కుడుములు చెరువుకు నీరు అందేలా పైపులైను వేయాలన్నారు. డైరెక్టర్ అనుసూరి సుబ్బారావు, అసిస్టెంట్ ఇంజినీర్ సురేంద్ర, సాంకేతిక నిపుణుడు ప్రసాద్, కార్యాలయం కార్యదర్శి తోటకూర పద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

బిక్కవోలు: ఆపరేషన్ సిందూర్ విజయవంతమవ్వాలని ఆకాంక్షిస్తూ దేవాలయాల్లో పూజలు జరుపుతున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం బిక్కవోలులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆలయంలో అభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

సీతానగరం: కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వరలక్ష్మి అన్నారు. ముగ్గళ్లలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు కలిసి మంగళవారం అంగన్‌వాడీ వర్కర్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్–1లో కిశోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పూర్ణశ్రీ, ఏఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు వెంకటలక్ష్మి, రోహిణి, రత్నకుమారి, ఆశావర్కర్లు మాధవి, మరియమ్మ పాల్గొన్నారు

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు

బిక్కవోలు: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతిరత్నకుమారి అన్నారు. కొంకుదురు గ్రామంలో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. చిన్న వయసులోనే పెళ్లి చేస్తే అమ్మాయికి ఆరోగ్య సంబంధిత సమస్యలు తలెత్తుతాయన్నారు. గర్భసంచి ఎదుగుదల సరిగ్గా లేకపోవడంతో తరచూ అబార్షన్లు జరుగుతాయన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. మీ పరిధిలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లు తెలిస్తే 1098 లేదా పోలీసు, ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై జానపద కళాజాత



కళాజాతను ప్రారంభిస్తున్న డాక్టర్ వసుంధర

కంబాలచెరువు: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై జానపద కళాజాతను మంగళవారం జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర ప్రారంభించారు. స్థానిక వాంబే కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జిల్లాను హెచ్ఐవీ, ఎయిడ్స్ రహితంగా చేయాలనే లక్ష్యంతో జానపద కళాజాత ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని 20 ముఖ్యమైన ప్రాంతాలలో ఈ నెల 23 వరకూ ఏపీ సాక్స్ వారితో శిక్షణ పొందిన రెండు కళజాత బృందాలు వీధి నాటికలు ప్రదర్శిస్తాయన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వచ్చే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సుఖ వ్యాధుల నివారణ మార్గాలు తదితర విషయాలను వివరిస్తారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, జిల్లా సూపర్‌వైజర్ ఏ.బుజ్జిబాబు, వైద్యాధికారి డాక్టర్ జ్యోతికిరణ్, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ సిబ్బంది పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి పూజలు

కడియం: కడియపులంకలోని మహాలక్ష్మి అమ్మవారిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆమెకు గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ ఘనంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదాశీర్వచనంతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పంతం గణపతి, స్థానిక నాయకులు బోడపాటి రాజేశ్వరి, మల్లు బాబీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్ వేడి

- ఉక్కబోతతో అల్లాడుతున్న చిన్నారులు
- ఇతర రాష్ట్రాల్లో సెలవులు
- ఆ ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- కిశోర వికాసం పేరుతో 10 వరకూ కార్యక్రమాలు

బిక్కవోలు: చిన్నారుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఎండలు మండిపోతున్నా అంగన్‌వాడీ సెంటర్లకు సెలవులు ఇవ్వడం లేదు. పక్కనే ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను ప్రకటించారు. అయితే ఇక్కడ కిశోర వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని దాదాపు అన్ని విద్యాసంస్థలకు వేసవి సెలవులు ప్రకటించినా, అంగన్ వాడీ కేంద్రాలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో చిన్నారులు ఉక్కబోతతో అల్లాడిపోతున్నారు.

ఇరుకు గదుల్లో..

నియోజకవర్గంలోని చాలీచాలని ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్న అంగన్ వాడీ కేంద్రాల్లో తీవ్ర ఉక్కపోతతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో అంగన్‌వాడీ టీచర్లకు 15 రోజులు, హెల్పర్లు 15 రోజులు సెలవులు మంజూరు చేసేవారు. ఇద్దరిలో ఎవరో ఒకరు మాత్రం కేంద్రాన్ని నిర్వహించాల్సి ఉంది. అయితే రెండు నెలల క్రితం జీతాల పెంపుతో పాటు పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని అంగన్‌వాడీలు ఆందోళనకు దిగారు. అప్పట్లో ప్రభుత్వం మాటను లెక్క చేయకుండా చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నా కూటమి ప్రభుత్వం.. అంగన్‌వాడీలకు జీతాలు పెంచకపోగా, వేసవి సెలవులు కూడా ఇవ్వకుండా కక్ష తీర్చుకునే ప్రయత్నం చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉక్కబోత తాళలేక..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన ప్రభుత్వం.. అంగన్‌వాడీ కేంద్రాల విషయంగా నిర్దయగా వ్యవహరించడం విడ్డురంగా ఉంది. సెలవులు ప్రకటించకపోవడంతో లబ్ధిదారులు తప్పనిసరిగా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. లేకపోతే వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రయోజనాలు అందకుండా పోతాయి. ఎండ వేడిమి ఉక్కపోత కారణంగా గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులైతే ఉక్కబోతకు తాళలేక ఏడుస్తుండడంతో వారిని సముదాయించలేక ఆయాలు ఇబ్బంది పడుతున్నారు.

మే నెలంతా కార్యక్రమాలు

కిశోర వికాసం పేరుతో వారానికి రెండు రోజులు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్ వాడీలు కార్యకర్తలు తమ కేంద్రాల పరిధిలోని కిశోర బాలికలను సర్వే చేసి, వారితో సచివాలయ పరిధిల్లోని ఏఎన్ఎంలు, ఎంఎస్‌కేలతో కలిసి ప్రతి మంగళ, శుక్రవారాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఎండలు అధికంగా ఉండే మే నెలలో ఈ సమావేశాలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ కావడంపై లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమం మంచిదే అయినా, వేసవిలో అంగన్‌వాడీలకు సెలవులు లేకుండా చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాలు దిద్దుతున్న చిన్నారులు (ఫైల్)

అనపర్తి నియోజకవర్గంలో..

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు
అనపర్తి	66	1,587
బిక్కవోలు	70	1,653
రంగంపేట	48	1,661
పెదపూడి	81	1,591
మొత్తం	265	6,492

ఇబ్బంది లేకుండా చర్యలు



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఫీడింగ్‌కు ఇబ్బంది తలెత్తకూడదని ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఉంచుకొని ఇళ్లకు పంపమన్నాం. నెలలో మొదటి 15 రోజులు కార్యకర్త మిగిలిన 15 రోజులు హెల్పర్ ఉండాలని ఉత్తర్వులు జారీ చేశాం. వేసవిలో చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

– జెస్సీ ఫ్లోరెన్స్, ఐసీడీఎస్ సీడీపీవో, రంగంపేట ప్రాజెక్టు

‘నన్నయ’ ప్రాంగణాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దుతాం



మొక్కల పెంపకంపై ఫారెస్టు అధికారికి సూచనలిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణాన్ని పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిద్దామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. 98 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న ఈ ప్రాంగణంలో విద్యాపరంగా ఉపయోగించే ప్రాంతాన్ని మినహాయించి, మిగిలిన ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉండేలా తయారు చేయాలని మంగళవారం యూనివర్సిటీని సందర్శించిన అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఎన్‌వీ శివప్రసాద్‌కు సూచించారు. నీడనిచ్చే చెట్లతో పాటు అనేక రకాల పక్షులకు ఆవాలంగా ఉండేలా వృక్షాలను పెంచాలన్నారు. వివిధ రకాల మొక్కలను నాటడం, బొటానికల్ గార్డెన్‌ను అభివృద్ధి పర్చడం చాలా ముఖ్యమన్నారు. వీసీ సూచనలపై ఫారెస్టు అధికారి సానుకూలంగా స్పందించి, శాఖాపరంగా తమ వంతు కృషి చేస్తామన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జి డీన్ డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజం కోసమే ‘ఈగల్’



మాట్లాడుతున్న సీఐ సూర్యమోహనరావు

రాజానగరం: మాదక ద్రవ్య రహితంగా సమాజాన్ని తయారు చేయాలన్నదే తమ లక్ష్యమని ఎలైట్ యాంటీ నార్కో టిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) సీఐ పీవీ సూర్యమోహనరావు అన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు అనే అంశంపై మంగళవారం స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలను తీసుకోవడం వలన వచ్చే అనర్థాలతో పాటు, ఆ నేరాలకు పాల్పడిన వారికి విధించే శిక్షలను వివరించారు. యువత వీటికి దూరంగా ఉండటమే కాకుండా వీటిని నిరోధించడంలో ప్రధాన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఈగల్ ఎస్సై బి.నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి దక్కని మద్దతు ధర

- కూటమి పాలనలో రైతుల అవస్థలు
- ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు కూటమి పాలనలో కనీస మద్దతు ధర లభించడం లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.1725 ఉండగా దళారీలు కేవలం రూ.1550కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో రైతులు ఎకరానికి సుమారుగా రూ.10 వేలు నష్టపోతున్నారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనా కాలం రైతులకు స్వర్ణయుగంగా ఉండేదన్నారు. విడతల వారీగా సమయానికి రైతు భరోసా డబ్బులు నేరుగా రైతుల ఖాతాలోనే పడేవన్నారు. పంటల బీమా, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సమయానికి రైతులకు అందజేసేవారన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో అవేమీ ఇవ్వకపోగా, బీమా కూడా దక్కని పరిస్థితి నెలకొందన్నారు. నియోజకవర్గంలో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూటమి నాయకులు తిష్ట వేసి లాభపడుతున్నారని ఆరోపించారు. ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్నను మోసం చేస్తే ఏ ప్రభుత్వం నిలవదన్నారు. ఉకదంపుడు ఉపన్యాసాలను కట్టిపెట్టి, ప్రతి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కల్పించాలని ఆందోళన



రఘుదేవపురం ఇసుక ర్యాంపు వద్ద ఆందోళనకు దిగిన ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు

సీతానగరం: ఇసుక తరలింపు ద్వారా తమకు ఉపాధి కల్పించాలని రఘుదేవపురం ర్యాంపులో మంగళవారం ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే ప్రక్కిలంకలోని 117 ఎకరాల లంక భూముల నుంచి ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు జరపడానికి అనుమతులు ఇచ్చారు. ఇసుకను రఘుదేవపురం ర్యాంపు నుంచి తీసుకువెళ్లడానికి అధికారులు ఓపెన్ రీచ్ ఏర్పాటు చేశారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రొక్లెయిన్లతో తవ్వకాలు జరిపి, కిలో మీటరు దూరంలోని రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు దగ్గరలో స్టాక్ పాయింట్‌కు లారీలపై ఇసుకను ర్యాంపు నిర్వాహకులు డంపింగ్ చేస్తున్నారు. గోదావరి వరద వచ్చే సమయానికి సుమారు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో లారీలపై స్టాక్ పాయింట్ వద్దకు ఇసుకను తరలిస్తున్నారు. అదే విధంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలకు ఇసుకను అమ్మకాలు జరుపుతున్నారు. దీనితో మంగళవారం రఘుదేవపురంలో ట్రాక్టర్లతో యజమానులు, డ్రైవర్లు ర్యాంపు వద్దకు చేరుకుని తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తు ర్యాంపు వద్ద ఆందోళనకు దిగారు. పరిమి శ్రీను, కాండ్రు చౌదరి, పాలచర్ల విస్సు, చుండ్రు హరి, ఆళ్ల సురేష్, చిట్టూరి రాజు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ లారీలపై స్టాక్ పాయింట్‌కు తరలించడం నిలిపివేయాలని, ట్రాక్టర్లపై ఇసుక డంపింగ్ చేసి, తమకు ఉపాధి కల్పించాలని కోరారు. సుమారు 80 కుటుంబాలు దీనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు.

ఉపాధి కూలీలందరికీ పని కల్పించాలి



పైన గ్రామంలో ఉపాధి కూలీల మస్తర్లు పరిశీలిస్తున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో అర్హత కలిగిన కూలీలందరికీ పని కల్పించాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పైన గ్రామంలో జరుగుతున్న చెరువు పూడికతీత పనులు, కూలీల మస్తర్లు ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని తోడించి పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలన్నారు. అలాగే రైతులకు అవసరమైన కాలువ బోదుల్లో పూడిక తీయించాలన్నారు. ఉపాధి పనులను మేట్లు నిబంధనలు ప్రకారం నిర్వహించాలన్నారు. బినామీ మస్తర్లు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించాలి



పిల్లల గుర్తింపు సర్వేను పరిశీలిస్తున్న కనకబాబు

రంగంపేట: ప్రత్యేక అవసరాలు గల పిల్లలందరినీ క్షేత్రస్థాయిలో గుర్తించాలని జిల్లా సమగ్ర శిక్ష, సహిత విద్య సమన్వయకర్త ఎస్.కనకబాబు అన్నారు. రంగంపేటలోని గోవింద రాజాపురం ఆవాస ప్రాంతంలో జరుగుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు ప్రత్యేక అవసరాలు గల పిల్లల (దివ్యాంగులు)ను అందరినీ గుర్తించి, వైకల్యం నిర్ధారణ చేసి వారి పేర్లు పాఠశాలలో నమోదు చేయాలన్నారు. వచ్చే నెల 9వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తద్వారా ప్రభుత్వం అందించే సదుపాయాలు, సౌకర్యాలు అన్నీ వారికి అందుతాయని తెలిపారు. వారికి ప్రత్యేక విద్య, ఫిజియోథెరపీ సేవలు కూడా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు అంజలి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామ శివారు సూర్యనారాయణపురంలో కొలువైన అలివేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణాన్ని సోమవారం రాత్రి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, కల్యాణాన్ని కనులారా తిలకించారు. ఆలయ ధర్మకర్త నల్లమిల్లి పద్మనాభ సత్యనారాయణరెడ్డి, మల్లిక ఆధ్వర్యంలో, వారి ఇంటి నుంచి ముత్యాల తలంబ్రాలు, పండ్లను కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. నల్లమిల్లి మోహనరామ గంగాధర్ రెడ్డి, అనంతలక్ష్మి దంపతులు కల్యాణంలో యజ్ఞకర్తలుగా కూర్చున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు అరవిల్లి సుందర రఘురామ్ ఆధ్వర్యంలో పండితులు కల్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం భక్తులకు తలంబ్రాలు పంపిణీ చేశారు.

తీయని విషం!

- మామిడి కాయలు పండించటానికి రసాయనాల వినియోగం
- అసహజ పద్ధతులు పాటిస్తున్న కొందరు వ్యాపారులు
- అవి తింటే అనారోగ్యాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మామిడి పండ్లు

రాజమహేంద్రవరం రూరల్: మామిడి పండ్ల వ్యాపారం రాజమహేంద్రవరం నగరం, పరిసర ప్రాంతాలలో జోరుగా సాగుతోంది. ఎండాకాలంలో నోరూరించే ఈ పండ్లను కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతారు. సీజన్ వారీగా దొరికే వీటిని ఇష్టపడని వారుండరంటే అతిశయోక్తి కాదు. సహజంగా ముగ్గిన పండ్లు ఎంతో రుచిగా ఉంటాయి. అయితే కొందరు వ్యాపారాలు రసాయనాలతో మామిడి కాయలను కృత్రిమంగా మగ్గబెడుతున్నారు. ఎక్కువ లాభాలను ఆర్జించాలనే దురుద్దేశంతో వీరు చేసే పని వల్ల మధుర ఫలం విషతుల్యమవుతుంది. రాజమహేంద్రవరం నగరం, పరిసర ప్రాంతాలలో కొన్నిచోట్ల కాల్షియం కార్బైడ్‌తో మగ్గబెట్టిన మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. ఈ కృత్రిమ పద్ధతుల్లో పండించిన మామిడి పండ్లు పసుపు రంగులో నిగనిగలాడుతూ కనిపిస్తాయి. వీటిని కొనుగోలు చేసి తింటున్న ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

విషతుల్యం

గతంలో పండ్లను సాధారణ పద్ధతుల్లో మగ్గబెట్టేవారు. జనాభా పెరుగుదల, పండ్ల వినియోగం పెరగడంతో కృత్రిమ పద్ధతులను పాటిస్తున్నారు. ఇలా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కాల్షియం కార్బైడ్ వినియోగం వల్ల జీర్ణకోశ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మామిడి సహా నేడు మార్కెట్లో దొరికే అరటి తదితర పండ్లను కృత్రిమంగానే మగ్గబెడుతున్నారు. ఈ అనర్థాలపై ఆహార భద్రతా నియంత్రణ అధికారులు రైతులకు, వ్యాపారులకు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు.

నిగారింపు

రసాయనాల మగ్గబెట్టిన మామిడి పండ్లు 24 గంటల్లోనే పండిపోతుంది. చక్కని పసుపు రంగుతో నిగనిగలాడుతుంది. సాధారణంగా మామిడికాయలను చెట్టు పైనే పక్వానికి వచ్చే వరకు ఉంచితే సహజ సిద్ధంగా తీపిగా ఉంటాయి. కానీ వ్యాపారులు పక్వానికి రాకుండానే పచ్చి కాయలను తోటల నుంచి మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. కాల్షియం కార్బైడ్‌ను వినియోగించి కాయలను 18 నుంచి 24 గంటల్లో పక్వానికి వచ్చేలా చేస్తున్నారు. అరటి, సపోటా, బొప్పాయి వంటి పండ్లను కూడా రసాయనాలతో మగ్గబెడుతున్నారు.

గుర్తించండి ఇలా..

- మామిడి, అరటి పండ్లను మగ్గబెట్టడానికి వ్యాపారులు ఎక్కువగా రసాయనాలను వినియోగిస్తున్నారు. కార్బైడ్ ఇథిలీన్‌తో మగ్గబెట్టిన పండ్లను గుర్తించడానికి నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.
- ఈ పండ్లు ఎక్కువ పసుపు వర్ణంలో ఉంటాయి. వీటిని తినేటప్పుడు నోటిలో కొంచెం మంట, కడుపులో నొప్పి, గొంతు నొప్పి మొదలవుతుంది.
- పండ్లను తిన్న తర్వాత డయేరియాకు గురైతే కాల్షియం కార్బైడ్, ఇథిలీన్ వాడినట్లు గుర్తించాలి.
- సహజ సిద్ధంగా మగ్గిన పండ్లపై ఆకుపచ్చ, పసుపు రంగు కనీకనిపించినట్టుగా ఉంటుంది. పండును కోసినప్పుడు లోపల గుజ్జు ఎరుపు, పసుపు రంగు కలిపినట్లు ఉంటుంది. ఈ పండ్లలో రసం ఎక్కువగా ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం

రసాయనాలు వాడి పండ్లకు మగ్గబెట్టడం వల్ల కలిగే అనర్థాలపై మామిడి రైతులకు, వ్యాపారులకు, వినియోగదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నాం. ఇప్పటికే మార్కెట్ యార్డులో ఇద్దరు వ్యాపారుల నుంచి నమూనాలను ల్యాబ్‌కు పంపించాం. మగ్గబెట్టిన మామిడిపండ్లు అని తేలితే రూ.5 లక్షలు నుంచి రూ.10 లక్షలు జరిమానాతో పాటు, వ్యాపారుల లైసెన్సు రద్దు చేయడం జరుగుతుంది.

– వి.రుక్కయ్య, ఆహార భద్రతా నియంత్రణ అధికారి, రాజమహేంద్రవరం

క్వారీ గోతులను తక్షణమే పూడ్చాలి



క్యాంపు కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని రామదాసుపేట, సుబ్బారావు నగర్ ప్రాంతాలలో మెటల్ కోసం తవ్విన క్వారీలలో ఏర్పడిన గోతులను తక్షణమే పూడ్చేందుకు సమన్వయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆర్ఎంసీ, మైన్స్, ఆర్అండ్‌బీ తదితర సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామదాసుపేట, సుబ్బారావు నగర్‌లోని మెటీరీలాజికల్ బెల్టులో మూడు దశాబ్దాలుగా రోడ్డు మెటల్ క్వారీలు నిర్వహిస్తున్నారన్నారు. క్వారీ లీజు పొందిన 51 సంస్థలు మెటల్ తవ్విన అనంతరం క్వారీని మట్టితో పూడ్చాలి అనే నిబంధనను పాటించలేదన్నారు. దీంతో ఆ క్వారీల వల్ల సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు వినియోగించే రహదారి ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ రహదారిలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. రెండున్నర కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించి, దానికి ఫెన్సింగ్ వేయడంతో పాటు లైటింగ్, సైన్‌బోర్డులు, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఆ రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలోపు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం 22ఏ కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై చర్చించారు. రాజేంద్ర నగర్, సుబ్బారావుపేట, నెహ్రూనగర్, బర్మా కాలనీ, బత్తిన నగర్, సంజీవయ్య నగర్, సింహాచలనగర్, రామదాసుపేట, ఆనంద నగర్‌లోని 22ఏ భూముల క్రమబద్ధీకరణ వివరాలను తెలియజేయాలని ఆదేశించారు.

పీజీఆర్ఎస్ అర్జీలపై వివరణ

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో పలు మార్లు వచ్చిన అర్జీలపై మండల స్పెషల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్ అధికారులను వివరణ అడిగి తెలుసుకున్నారు. ఆయన మంగళవారం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.భారతి, ఎస్సై డి.రామ్‌కుమార్‌లతో కలిసి పలు మార్లు అర్జీలను అందించే అర్జీదారులతో మాట్లాడారు. చినకొండేపూడికి చెందిన అడ్వకేట్ నకుల సురేష్.. నాగంపల్లి చెరువులు ఆక్రమణకు గురయ్యాయని, సర్వే చేయాలని అర్జీని పలు మార్లు పెట్టడంపై స్పెషల్ ఆఫీసర్ తహసీల్దార్‌కు తెలియపర్చారు. పంచాయతీ తీర్మానం తీసుకుని సర్వే చేయిస్తామన్నారు. అలాగే ఇటుక బట్టీల నుంచి అధికంగా కాలుష్యం వెలువడుతుందని, బట్టీలకు వచ్చే మట్టిపై పన్నులు విధిస్తున్నారా అని వచ్చిన అర్జీలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఏవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ రాజ్ ఇన్‌చార్జ్ ఏఈ జోయల్, మండలంలోని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.